క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో మాజీ మంత్రి కొణతాల

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేతాజీకి ఘన నివాళులు



నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్య్ర సమర యోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జీవితాన్ని విద్యార్థులకు పాఠ్యాంశంగా చేయాలని న్యాయవాదులు ప్రభుత్వాన్ని కోరారు. నేతాజీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని గాంధీ స్మృతివనంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, బీసీ అడ్వకేట్ జిల్లా అధ్యక్షుడు ఆగూరి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, కేంద్ర న్యాయవాదులు బి.వి.రమణ, బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు లంపీ స్కిన్ టీకాలు



లావేరులో పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

లావేరు: లావేరు, గుమడాం, లింగాలవలస, వెంకటాపురం, బెజ్జిపురం, అదపాక తదితర గ్రామాల్లో వెటర్నరీ అసిస్టెంట్‌లు, సిబ్బంది శుక్రవారం పర్యటించి పశువులకు ఉచితంగా లంపీ స్కిన్ నివారణ టీకాలు వేశారు. పశువులకు వ్యాధి రాకుండా ముందస్తుగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేస్తున్నామని.. పాడి రైతులు తమ పశువులకు విధిగా టీకాలు వేయించాలని సిబ్బంది సూచించారు.

వేగ నియంత్రణకు చర్యలు



రామతీర్థాలు కూడలిలో డ్రమ్ములను పెడుతున్న ఎస్సై రాజేష్, పోలీసు సిబ్బంది

రణస్థలం: జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్లలో వాహనాల వేగనియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జేఆర్‌పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు. ఇందులో భాగంగా బోర్డుల ఏర్పాటు, ఇసుకతో కూడిన డ్రమ్ములను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మండల కేంద్రంలోని రామతీర్థాలు, దన్నానపేట, పాత పెట్రోల్ బంక్ కూడలిలో వేగ నియంత్రణ డ్రమ్ములను శుక్రవారం పెట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేటపుడు, విడిచిపెట్టే సమయాల్లో ట్రాఫిక్ ఎక్కువ ఉంటుందన్నారు. ఆ సమయంలో ఇద్దరేసి కానిస్టేబుళ్లను విధుల్లో ఉంచి వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. రణస్థలంలో వాహనాలను జాతీయ రహదారి పై నిలపకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు.

మగ్గం వర్క్‌తో అదనపు ఆదాయం

ఆమదాలవలస రూరల్: మహిళలకు బ్లాక్ పెయింటింగ్, మగ్గం వర్క్‌పై నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా అదనపు ఆదాయం వస్తుందని సిడ్బి బ్యాంక్ మేనేజర్ సుకుమార్ అన్నారు. శ్రీనివాసాచార్యులపేట చేనేత కార్యాలయంలో సిడ్బి బ్యాంక్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. శిక్షణ అనంతరం యూనిట్ ఏర్పాటు చేసుకుంటే మంచి ఆదాయం పొందవచ్చునని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు బ్లాక్ పెయింటింగ్, మగ్గం వర్క్‌ల తయారీకి మంచి గిరాకీ ఉందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ ఎన్.సన్యాసిరావు, చేనేత కంపెనీల సీఈవోలు బి.శంకరరావు, సూర్యనారాయణ, అప్పలనాయుడు, వాసు పాల్గొన్నారు.

150 పనిదినాల కల్పనకు చర్యలు

మెళియాపుట్టి: ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చిన వారికి 150 పనిదినాలు కల్పించడానికి కసరత్తు చేయాలని టెక్కలి ఉపాధి హామీ పథకం ఏపీడీ శైలజ అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం సమీక్షించారు. మండలంలో సుమారు 4,200 మంది పట్టాదారులు ఉన్నారని.. మరోసారి క్షేత్ర స్థాయిలో క్రాస్‌చెక్ చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారన్నారు. నాలుగు రోజుల్లోగా పూర్తిడేటాను అందజేయాలని సిబ్బందికి సూచించారు. దీనివలన గిరిజన కుటుంబాలు 150 రోజుల ఉపాధి పనిదినాలు పొందుతారన్నారు. ఏపీవో రవి, ఈసీ ఆదినారాయణరెడ్డి, సీవోలు అనిల్, ప్రకాష్, పున్నయ్య ఉన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ



శ్రీకాకుళం కల్చరల్: ఆదిలక్ష్మీగా విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: వాసవీమాతకు ప్రత్యేక అలంకరణ



అయ్యప్ప దేవాలయంలో మహాలక్ష్మీ అలంకరణ



ఎచ్చెర్ల క్యాంపస్: ప్రత్యేక అలంకరణలో లలితాదేవి అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: ప్రత్యేక అలంకరణలో విజయగణపతి



శ్రీకాకుళం కల్చరల్: కోటేశ్వరాలయంలో రాజరాజేశ్వరీదేవి

శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఇళ్లల్లో శ్రావణ శుక్రవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుటుంబానికి సకల శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ శ్రావణ లక్ష్మికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాలకు వెళ్లి అమ్మవారికి కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేట దేవీపీఠంలో పూజలు



జి.సిగడాం: కంచికామాక్షి అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



నక్కవీధిలో కుంకుమ పూజలు



శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాత ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



లావేరులోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: బాలాత్రిపుర కాల భైరవాలయంలో కుంకుమపూజలు

కత్తెర పురుగు నివారణపై అవగాహన



కషాయం తయారు చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మొక్కజొన్న సాగులో ఎక్కువగా కత్తెర పురుగు సోకడంతో పంటను నాశనం చేస్తుందని.. వీటి నిర్మూలన కోసం అగ్గిఅస్త్రం కషాయం బాగా పనిచేస్తోందని నేచురల్ యూనిట్ ఇన్‌చార్జి ఎస్.సంతోషి అన్నారు. జాడ గ్రామంలో మొక్కజొన్న పంటపై సోకిన కత్తెర పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 30 లీటర్ల (ఫాల్‌ఆర్మీ వార్మ్) అగ్గిఅస్త్రం తయారు చేశామన్నారు. వీటిని రైతులు వినియోగించుకుంటే కత్తెర పురుగు నివారణతో పాటు అధిక దిగుబడులు సాధించగలరన్నారు. రైతులకు లభించే సహజ వనరులను వినియోగించి వివిధ రకాల ద్రావణాలు, కషాయాలను తయారు చేసుకుంటే సుస్థిర వ్యవసాయంతో సురక్షిత ఆరోగ్యం సాధించుకోవచ్చున్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేసుకుంటే తక్కువ పెట్టిబడి, అధిక దిగుబడులు సాధించగలమన్నారు. బీజా అమృతం, ఘనజీవాఅమృతం, ద్రవ జీవా అమృతం, నీమాస్త్రం, వావిలాకు కషాయం, తూటికాడ కషాయం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, మరేడు పత్రం కషాయాలను తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చాన్నారు.

నైపుణ్యమే కీలకం



మాట్లాడుతున్న మణిశర్మ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యం కీలకమని జేసీఐ అధ్యక్షురాలు మణి శర్మ అన్నారు. చిలకపాలెంలోని శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శుక్రవారం శ్రీకాకుళం పట్టణానికి చెందిన జేసీఐ సంస్థ ఫ్యూచర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థులకు ఇంజినీరింగ్ రిలీవ్ తరువాత అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, సబ్జెక్టు నాలెడ్జ్, సాఫ్ట్ స్కిల్స్ సంపాదించాలని అన్నారు. పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగితే మంచి విజయాలు అందుకుంటారన్నారు. పరిశ్రమలు విద్యార్థుల్లో నైపుణ్యాలు, శ్రమించేతత్వం పరిశీలిస్తున్నాయని అన్నారు. క్రమశిక్షణ, సమయ పాలన, పరిశ్రమ వంటివి అలవాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధి వి.రాజేష్, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.టి.చంద్రశేఖర్, అధ్యాపకులు మధుబాబు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



పాలతో అభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

గార: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి తమ జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కాంట్రాక్టు ఉద్యోగులు అన్నారు. శుక్రవారం కళింగపట్నంలోని కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పలరాము, ఇందిర, లోలుగు లక్ష్మణ రావు, పొన్నాడ అప్పలనాయుడు, ఎస్.మల్లిబాబు, ఎన్ని రమణారావు, ఎస్‌వీఎస్ సత్యనారాయణ, కిలారి శ్రీనివాసరావు, ఎండు రామకృష్ణ, రానా రాజేంద్రబాబు పాల్గొన్నారు.

కొఠారిచండీ ఆలయంలో చోరీకి యత్నం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పిరియా సాయిరాజ్, ఎస్‌ఐ రాము

కవిటి: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం కొఠారిచండీ అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి చోరీకి దుండగులు ప్రయత్నించారు. ఈ విషయం సర్పంచ్ జానకిరావు, ఎంపీటీసీ కృష్ణారావు ద్వారా తెలుసుకున్న పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఎస్‌ఐ కె.రాముతో కలిసి శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. ఆలయం వెలుపల చిన్నపాటి హుండీలో మాత్రమే చోరీకి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. గర్భగుడి వస్తువులు చోరీకి గురికాలేదని వివరించారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: రక్తదానంపై అపోహలు వీడి స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులంతా కలిసి 97 యూనిట్ల రక్తం దానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు భరద్వాజ్, లిఖిత, శ్రీకాంత్, కళాశాల అధ్యాపకులు ఎ.ఎస్.శ్రీనివాసరావు, డి.విష్ణుమూర్తి, ఎం.జయమన్మథరావు, బి.బలరాం, ప్రకాశ్‌రావు, నర్సింహమూర్తి, చంద్రశేఖర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎస్.సంతోష్, బి.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయంలో ఈ నెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.భాస్కరరావు కోరారు. ఈ మేరకు సోంపేట కోర్టుల సముదాయంలో శుక్రవారం న్యాయవాదులు, సోంపేట సర్కిల్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము, సోంపేట సీఐ ఆర్.రవిప్రసాద్, ఎస్‌ఐలు జి.శంకరరావు, బి.హైమావతి, ఎస్.చిరంజీవి, కె.గోవిందరావు, న్యాయవాదులు శైలేంద్ర, జోగారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్లు మంజూరు

కోటబొమ్మాళి: మండలంలో తాటిపర్తి, కమలనాభపురం, కూర్మనాథపురం గ్రామాల్లో కొత్తగా బీఎస్ఎన్ఎల్ 4జీ సెల్‌టవర్లు ఏర్పాటు చేయనున్నట్లు నరసన్నపేట సంస్థ సబ్ డివిజినల్ కార్యాలయ ఇంజినీర్ బి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సెల్ సిగ్నల్ తక్కువగా ఉన్నందున వీటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్థలం కేటాయించాలని తహసీల్దార్ జామి ఈశ్వరమ్మకు ఇటీవల దరఖాస్తు చేశామని, మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఉజ్జాపన



ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తిప్పనపుట్టుగలో ఒరియా వీధిలో శుక్రవారం సంతోషిమాత ఉజ్జాపన ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి వేషధారణలో మేళతాళాలు మధ్య భక్తులు ఘటాలను ఊరేగించారు. అనంతరం ఈదుపురం బహుదానదిలో నిమజ్జనం చేశారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు



మంత్రి ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐ కామేశ్వరరావు

గార: నిబద్ధతతో పనిచేస్తే తప్పక గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సీఐగా పదోన్నతి పొందిన గార ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు శుక్రవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ కొద్ది రోజుల్లోనే ఎస్‌ఐగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అనంతరం ఎస్పీ జి.రాధికను ఎస్‌ఐ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. కుశాలపురం బైపాస్ కూడలి సమీపంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎచ్చెర్ల మండల గ్రామ సచివాలయ కన్వీనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్ల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. గ్రామ వలంటీర్లు, గృహ సారథులతో సమన్వయం చేసుకుని ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. ప్రజల సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూడాలన్నారు. ఓటర్ల జాబితాల్లో చేర్పులు, తొలగింపులు పరిశీలించాలని సూచించారు. కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికయ్యేలా సైనికుల్లా శ్రమించాలని కోరారు. సమావేశానికి జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు అధ్యక్షత వహించగా.. పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, మండల విప్ బగ్గు రాజారావు, నాయకులు బెండు రామారావు, బోర సాయిరాం పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

టెక్కలి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని టెక్కలి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. టెక్కలి గోపినాథపురంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో వివాహాల వల్ల శిశు మరణాల రేటు పెరుగుతుందన్నారు. అనారోగ్యంతో పిల్లలు జన్మిస్తారని చెప్పారు. అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిషేధానికి ప్రతిఒక్కరూ చైతన్యం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానందా, ఎస్‌ఐ రామకృష్ణ, న్యాయవాదులు డి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

టెక్కలి: టెక్కలికి చెందిన అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో పలువురు దాతలు వైద్యానికి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. సోంపేటకు చెందిన దున్న ఈశ్వరరావు ఇటీవల రైలు ప్రమాదానికి గురై కాలు కోల్పోవడంతో అతనికి రూ.10 వేలు అందించారు. టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీకు చెందిన కూర్మాపు సంతోష్‌కుమార్ ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడటంతో అతనికి రూ.6 వే అందజేశారు. పట్టణానికి చెందిన వైద్యులు సీపాన శ్రీనుబాబు, అన్నెపు వినోద్‌కుమార్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్, ప్రతినిధులు బి.మధు, ఎన్.సింహాచలం, పి.రమేష్, ఎ.వీరభద్రాచారి, ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

టెక్కలి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అన్నారు. ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న టెక్కలి ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తిని శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు అండగా ప్రభుత్వం



భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: ప్రభుత్వ పెన్షన్‌దారులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట పట్టణంలో జెడ్పీ నిధులతో నిర్మించిన ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి విశ్రాంత ఉద్యోగులు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి ముందుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, ఉప సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ పొడుగు కామేష్, సంఘ ప్రతినిధులు కృష్ణారావు, జోగారావు, పండా, ఎం.వీరన్న పాల్గొన్నారు.